క్లుప్తంగా

కనుల పండువగా గరుడసేవ



నందిగామరూరల్: మండలంలోని పల్లగిరి గట్టుపై వేంచేసియున్న కళ్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి గరుడసేవ కార్యక్రమాన్ని కనుల పండువగా నిర్వహించారు. ఆశ్వీజ పౌర్ణమి సందర్భంగా మంగళ వారం అలివేలు మంగా పద్మావతి సమేత కళ్యాణ వెంకటేశ్వరస్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు చేశారు. ముందుగా పలు రకాల పుష్పాలతో పుష్పార్చన చేశారు. అనంతరం మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణ నడుమ ప్రత్యేకంగా అలంకరించిన గరుడ వాహనంపై స్వామి, అమ్మవారిని మాఢవీ ధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కొత్త హనుమేశ్వరరావు, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి భూమిపూజ



గుమ్మడిదుర్రు(పెనుగంచిప్రోలు): గ్రామంలోని వైఎస్సార్ కాలనీలో జెడ్పీ నిధులు రూ.5లక్షలతో నిర్మించనున్న డ్రైనేజికి గ్రామ సర్పంచ్ నక్కా కమల మంగళవారం శంకుస్థాపన చేశారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ అందరి సహకారంతో గ్రామాభివృద్ధికి కృషిచేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు బారు సుధారాణి, వైఎస్సార్‌సీపీ గ్రామాధ్యక్షుడు ఎస్.ప్రవీణ్, నాయకులు అచ్యుతరావు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా భూముల రీసర్వే : తహసీల్దార్

నందిగామరూరల్: ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు భూముల రీసర్వే ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సురేష్‌బాబు తెలిపారు. మూడవ దశ రీ సర్వేలో భాగంగా మండలంలోని మాగల్లు గ్రామంలో మంగళవారం గ్రామ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడవ దశ భూముల రీసర్వే కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. రైతులు షెడ్యూల్ ప్రకారం హాజరై తమ పొలాల హద్దులను చూపించుకుని సర్వే చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

వాల్మీకి మహర్షి చిరస్మరణీయుడు



నందిగామటౌన్: శ్రీరామ నామ మాధుర్యాన్ని మనకందించిన వాల్మీకి మహర్షి చిరస్మరణీయుడని నందిగామ గ్రంథాలయాధికారి అల్లూరు రామచంద్రుడు పేర్కొన్నారు. పట్టణంలోని శాఖా గ్రంథాయంలో వాల్మీకి జయంతి వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్ర పటానికి విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు రాజగోపాలరావుతో కలిసి ఆయన పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈసందర్భంగా రామచంద్రుడు మాట్లాడుతూ రామాయణ మహత్తర కావ్యం ద్వారా విలువైన సత్యాలను అందించారని కొనియాడారు. కార్యక్రమంలో విద్యార్థులు పాల్గొన్నారు.

వీరులపాడు మండలంలో..

వీరులపాడు: మండలంలోని పెద్దాపురంలో మంగళవారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. వాల్మీకి చిత్రపటానికి గ్రామస్తులు పూల మాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఎస్‌వి రామారావు, నారాయణ, శివరోసియా, వెంకటేశ్వర్లు, గురుమూర్తి, సుబ్బమ్మ, శేషగిరి, కృష్ణ పాల్గొన్నారు.

దేశద్రోహంగా పరిగణించి శిక్షించాలి

నందిగామరూరల్: సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి గవాయిపై జరిగిన దాడి యత్నాన్ని దేశద్రోహ నేరంగా పరిగణించి కఠినంగా శిక్షించాలని ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. పట్టణంలోని బీఎస్పీ కార్యాలయంలో సమత క్లబ్, జాషువా ఫౌండేషన్, బీసీ సంఘాలు, మైనార్టీ సంక్షేమ సంఘాలు, బహుజన సేవా సమితి నేతలు ప్రధాన న్యాయమూర్తిపై న్యాయవాది దాడి యత్నాన్ని మంగళవారం తీవ్రంగా ఖండించారు. కార్యక్రమంలో నాయకులు పత్తిపాటి సూర్యం, కెజెడ్‌ఎస్ కుమార్, కోట రవీంద్రనాద్, పిల్లి జయరాజు, షేక్ ఖాజా మొహిద్దీన్, దామాల కిశోర్, కురగంటి హనుమంతరావు, కొత్తపల్లి సుందరరావు పాల్గొన్నారు.

భారీగా తగ్గిన మిర్చి సాగు విస్తీర్ణం

- గతేడాది మిర్చికి లభించని గిట్టుబాటు ధర..
- క్వింటా మిర్చి రూ.10వేలకు మించని వైనం
- తీవ్రంగా నష్టపోయిన మిర్చి రైతులు
- ఈ ఏడాది మిర్చిసాగుకు విముఖత
- 50శాతానికి పడిపోయిన సాగు విస్తీర్ణం



పెనుగంచిప్రోలులో సాగవుతున్న మిర్చి పంట

పెనుగంచిప్రోలు: గతేడాదితో పోల్చితే జగ్గయ్యపేట నియోజకవర్గంలో మిర్చి సాగు విస్తీర్ణంగా ఈ ఏడాది భారీగా తగ్గింది. ఎర్ర బంగారంగా పిలవబడే మిర్చి మెట్ట ప్రాంతంలో అధికంగా సాగు చేస్తారు. గత ఏడాది మిర్చికి గిట్టుబాటు ధర లభించకపోవడంతో రైతులు తీవ్రనష్టాలకు గురయ్యారు. దీంతో ఈఏడాది మిర్చి సాగు సగానికి పడి పోయింది. ఒకవైపు పెట్టుబడులు పెరగడం, మరో పక్క ధరలు లేక పోవడంతో రైతులను కుంగదీసింది. గతేడాది అధిక ధరలకు మిర్చి మొక్కలను విక్రయించిన నర్సరీ యజమానులు కూడా ఈఏడాది తగిన డిమాండ్ లేకపోవడంతో కొంత ధర తగ్గించి విక్రయిస్తున్నారు. అదేసమయంలో రైతులు ఎక్కువగా తేజ లాంటి సన్న రకం మిరప మొక్కలు సాగు వైపు దృష్టి సారిస్తున్నారు. లావు రకాలతో పోలిస్తే వీటికి ధర కొంత అధికంగా ఉంటుందని రైతులు భావిస్తున్నారు. కూటమి ప్రభుత్వం మిర్చికి తగిన మద్దతు ధర ఇవ్వడంలో విఫలం కావడంతో రైతులు ప్రత్యామ్నాయంగా సుబాబుల్, జామాయిల్, పత్తి , మొక్కజొన్న పంటల సాగు చేపట్టారు.

నియోజకవర్గంలో...

ఈఏడాది జగ్గయ్యపేట నియోజకవర్గంలో ఇప్పటి వరకు 3,600 హెక్టార్లలో మిర్చి సాగు చేయగా మరో 200 హెక్టార్లలో సాగు చేపట్టే అవకాశం ఉందని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. గతేడాదితో పోల్చితే సాగు విస్తీర్ణం 50 శాతం తగ్గినట్లు సమాచారం.

పదివేలకు మించని ధర..

గతేడాది మిర్చి క్వింటా ధర రూ.10వేలకు మించకపోవడంతో సాగుఖర్చులు కూడా రాలేదంటూ రైతులు అల్లాడిపోయారు. ఈ అంశమే రైతులు ఈ ఏడాది మిర్చిసాగుపై విముఖత చూపడానికి ప్రధాన కారణం. అంతకుముందు ఏడాది అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో క్వింటా మిర్చి ధర రూ.23వేల వరకు పలుకగా, అదేస్థాయిలో ధరలు ఉంటాయని నమ్మకంతో గతేడాది మిర్చి సాగు చేసి తీవ్రంగా నష్టపోయామని రైతులు వాపోతున్నారు. కోల్డ్ స్టోరేజీల్లో నిల్వ చేసి ఖర్చులు భరించినా కూడా మిర్చి ధర ఏమాత్రం పెరగకపోవడం తమ పాలిట శాపంగా మారిందని రైతులు వాపోతున్నారు. ఈక్రమంలో ఈ ఏడాది మిర్చి సాగు విస్తీర్ణం తగ్గిన నేపథ్యంలో మొక్కలను పెంచే నర్సరీలకు కూడా డిమాండ్ తగ్గింది.అందుకే ఈ ఏడాది మిర్చిసాగుకు మొగ్గుచూపడం లేదని రైతులు చెబుతుండటం గమనార్హం.

ఆర్టీసీ ప్రయాణీకుల కష్టాలు తీర్చాలి : తన్నీరు



పేట ఆర్టీసీ బస్టాండ్‌ను పరిశీలిస్తున్న తన్నీరు నాగేశ్వరరావు, నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: జగ్గయ్యపేటలో ఆర్టీసీ ప్రయాణికులు పడుతున్న కష్టాలు తీర్చాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తన్నీరు నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌ను స్థానిక నాయకులతో కలిసి మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా తన్నీరు మాట్లాడుతూ బస్టాండ్‌లో ప్రయాణికులకు తాగునీటి సౌకర్యం కల్పించాలని, క్షీణ దశలో ఉన్న టాయిలెట్ల స్థానంలో నూతన టాయిలెట్లు నిర్మించాలని కోరారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 18 నెలలు గడచినా ఆర్టీసీ ప్రయాణికులకు కష్టాలు తప్పడం లేదన్నారు. రూ.1.25కోట్లతో నిర్మించిన హైవే బస్టాండ్‌ను వినియోగంలోకి తీసుకురావడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందన్నారు. ఏపీఎస్ ఆర్టీసీ బస్సుల్లో కోదాడ, వైరా, చింతిర్యాల వెళ్లే ట్రిప్పులలో స్త్రీశక్తి పథకం కింద మనరాష్ట్ర సరిహద్దు వరకు మహిళలకు ఉచిత ప్రయాణ సదుపాయం కల్పించాలన్నారు. తెలంగాణ బస్సుల్లో ఆరాష్ట్ర మహిళలకు రాష్ట్ర సరిహద్దు వరకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్నందున మనరాష్ట్రంలోనూ అదేవిధానాన్ని అమలుచేయాలని కోరారు. ప్రయాణికుల సమస్యల పరిష్కారానికి స్థానిక ఎమ్మెల్యే ప్రత్యేకంగా దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రయాణీకుల సమస్యల పరిష్కారం కోసం తమ పార్టీ తరపున పోరాటం చేస్తామని తెలిపారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు పఠాన్ ఫిరోజ్‌ఖాన్, జిల్లా కార్యదర్శి వేముల మల్లేశ్వరరావు, మండల నాయకులు దాచేపల్లి సత్యనారాయణ, చిగురుపాటి సారథి, షేక్ మతిన్ తదితరులు ఉన్నారు.

మద్యం దుకాణాల్లో విస్తృత తనిఖీలు



వీరులపాడులోని మద్యం దుకాణాన్ని పరిశీలిస్తున్న ఎక్సైజ్ సీఐ అశ్రఫున్నీసా బేగం

వీరులపాడు: ప్రభుత్వం నిర్దేశించిన మద్యం దుకాణాలలో ఇతర రాష్ట్రాల నుంచి మద్యం కొనుగోలు చేసి విక్రయిస్తే చర్యలు తప్పవని ఎక్సైజ్ సీఐ అశ్రఫున్నీసా బేగం హెచ్చరించారు. ఇబ్రహీంపట్నంలో భారీగా కల్తీ మద్యం పట్టుబడిన నేపథ్యంలో ఎక్సైజ్‌శాఖ అధికారులు మంగళవారం వీరులపాడు మండలంలోని మద్యం దుకాణాల్లో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. మద్యం నిల్వలు, స్టాక్ రిజిష్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. ఈసందర్భంగా ఎక్సైజ్ సీఐ మాట్లాడుతూ అక్రమ మద్యం విక్రయాలు చేసినా, ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని దుకాణాదారులను హెచ్చరించారు.

నందిగామ మండలంలో..

నందిగామటౌన్: కల్తీ మద్యం వ్యవహారం వెలుగుచూసిన నేపథ్యంలో నందిగామ మండలంలోని మద్యం దుకాణాలను ఎక్సైజ్ సీఐ రమాదేవి మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనల మేరకే మద్యాన్ని విక్రయించాలన్నారు. ఇతర రాష్ట్రాల మద్యం, కల్తీ మద్యం విక్రయాలు సాగిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే బాధ్యులపై కఠినచర్యలు తీసుకుంటామని తెలిపారు.

న్యాయవాదుల నిరసన



నందిగామ కోర్టు ఆవరణలో విధులు బహిష్కరించి నిరసన వ్యక్తం చేస్తున్న న్యాయవాదులు



పేటలో నిరసన వ్యక్తం చేస్తున్న ఐలు నాయకులు, న్యాయవాదులు

నందిగామరూరల్: సనాతన ధర్మం ముసుగులో సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి బీఆర్ గవాయిపై దాడికి యత్నించిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవాలని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నంద్రు బాబువిద్యాసాగర్ కోరారు. ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి యత్నంను ఖండిస్తూ న్యాయవాదులు మంగళవారం విధులు బహిష్కరించి కోర్టు ఆవరణలో నిరసన వ్యక్తం చేశారు. గాంధీ సెంటరులో మానవహారం నిర్వహించి ఆర్డీవో కార్యాలయంలో వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ న్యాయమూర్తిపై దాడి ప్రజాస్వామ్యంపై జరిగిన దాడిగా అభివర్ణించారు. భారత రాజ్యాంగ వ్యవస్థల్లోని మౌలిక వ్యవస్థగా ఉన్న న్యాయ వ్యవస్థపై దాడికి యత్నించడం బాధాకరమని పేర్కొన్నారు. దాడికి యత్నించిన న్యాయవాదిపై కఠిన చర్యలు తీసుకోవటంతోపాటు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. నిరసనవ్యక్తంచేసినవారిలో న్యాయవాదులు కన్నెకంటి జీవరత్నం, మన్నెం నారాయణరావు, యర్రంరెడ్డి బాబురావు, బండి మల్లికార్జునరావు, అద్దంకి మణిబాబు, షేక్ సైదా, మద్దుకూరి శిరీష, ఎండీ అమీన్, ఎక్కిరాల హనుమంతరావు తదితరులు ఉన్నారు.

జగ్గయ్యపేటలో..

జగ్గయ్యపేటఅర్బన్: సుప్రీంకోర్టు ప్రధానన్యాయమూర్తి గవాయిపై దాడికి యత్నించిన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని జగ్గయ్యపేట న్యాయవాదులు డిమాండ్ చేశారు. చీఫ్ జస్టిస్ గవాయిపై దాడి యత్నాన్ని నిరసిస్తూ పట్టణంలోని ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రాంగణంలో ఆలిండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఆధ్వర్యంలో న్యాయవాదులు మంగళవారం కోర్టు విధులను బహిష్కరించి నిరసన వ్యక్తంచేశారు. ఈసందర్భంగా ఐలు నాయకులు కాసరగడ్డ నాగేశ్వరరావు మాట్లాడుతూసీజేఐపై దాడిని రాజ్యాంగంపై జరిగిన దాడిగా పరిగణించి దాడిచేసిన న్యాయవాదిని కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో ఐలు నాయకులు కె.శ్రీనివాసరావు, జె.వెంకట్రావు, రత్నబాబు, దాసరి నాగేశ్వరరావు, న్యాయవాదులు జె.శ్రీనివాసరావు, పి.నాగరాజు, బసవరాజు, టీఎల్.నరసింహారావు, మెట్టిల ఆంజనేయులు పాల్గొన్నారు.

డివిజన్‌లో 191.8 మి.మీ. వర్షపాతం

నందిగామరూరల్: నందిగామ డివిజన్‌లోని నందిగామ, జగ్గయ్యపేట నియోజకవర్గాల్లో సోమవారం రాత్రి 191.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఉప గణాంకాధికారి ప్రసాద్ మంగళవారం తెలిపారు. నందిగామ నియోజకవర్గంలోని వీరులపాడు మండలంలో అత్యధికంగా 52.2 మి.మీ వర్షం కురిసింది. నందిగామ మండలంలో 22.4 మి.మీ, కంచికచర్ల మండలంలో 40.6మి.మీ, చందర్లపాడు మండలంలో 15.8 మి.మీ వర్షపాతం నమోదైంది. జగ్గయ్యపేట మండలంలో 24.8 మి.మీ., పెనుగంచిప్రోలు మండలంలో 5.8 మి.మీ., వత్సవాయి మండలంలో 30.2 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైనట్లు ఆయన వివరించారు.

ముగిసిన స్కూల్ గేమ్ సెలక్షన్స్



పెనుగంచిప్రోలు: స్థానిక కేవీఆర్ జెడ్పీ హైస్కూల్ క్రీడా ప్రాంగణంలో మంగళవారం ఎన్టీఆర్ జిల్లా స్కూల్ గేమ్స్ ఆధ్వర్యంలో పెనుగంచిప్రోలు మండల స్కూల్ గేమ్స్ సెలక్షన్స్ నిర్వహించారు. పోటీలను హెచ్‌ఎంలు కె.జలజ, నక్కా బాబూరావు ప్రారంభించారు. అండర్–14, అండర్–17 విభాగంలో బాలురు, బాలికలకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, చెస్, యోగ, అథ్లెటిక్స్ అంశాల్లో సెలక్షన్స్ నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారు డివిజన్ పోటీల్లో పాల్గొంటారని పీడీ వేగినేటి రమణ తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ సముద్రాల రామారావు, మండల పీఈటీలతోపాటు వత్సవాయి, జగ్గయ్యపేట మండలాల వారు కూడా పాల్గొన్నారు.

జీఎస్టీలో మార్పులపై విద్యార్థులకు అవగాహన



జీఎస్టీపై అవగాహన కలిగిస్తున్న అధికారులు



చిత్రలేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

నందిగామటౌన్: కేంద్ర ప్రభుత్వం జీఎస్టీలో తీసుకొచ్చిన విప్లవాత్మక మార్పులు పేద, మధ్య తరగతి ప్రజలు, వ్యాపారులకు ఎంతోగానే ఉపయోగకరంగా ఉన్నాయని జీఎస్టీ అసిస్టెంట్ కమీషనర్ బాబునాయక్ పేర్కొన్నారు. పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు జీఎస్టీ 2.0పై మంగళవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సులభతర పన్ను విధానం ద్వారా వ్యాపారులు సులభంగా పన్నులు చెల్లించవచ్చన్నారు. నూతన జీఎస్టీ ద్వారా విద్యా, వైద్యరంగాలకు రాయితీలు కల్పించినట్లు చెప్పారు. ముఖ్యంగా విద్యా సంబంధమైన వస్తువులపై పన్నులను పూర్తిగా తొలగించినట్లు తెలిపారు. కార్యక్రమంలో జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సత్యకుమార్, హెచ్‌ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు వీరభద్రరావు, శ్రీధర్, శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

నందిగామరూరల్: విద్యార్థులు జీఎస్టీపై అవగాహన కలిగి ఉండాలని జీఎస్టీ అసిస్టెంట్ కమిషనర్ బాబునాయక్ సూచించారు. మండలంలోని చందాపురం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం సూపర్ జీఎస్టీపై విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖనం పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఎస్టీలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన మార్పులతో పేద, మధ్య తరగతి ప్రజలకు మేలు కలుగుతుందన్నారు. వినియోగదారులు కొనుగోలు చేసిన వస్తువులకు తప్పనిసరిగా రశీదులు తీసుకుంటే బ్లాక్ మార్కెట్‌ను అరికట్టవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో జీఎస్టీ డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్ సత్యకుమార్, హెచ్‌ఎం రాజశేఖర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వాట్సాప్ గవర్నెన్స్‌తో సమస్యలకు పరిష్కారం

ఎమ్మెల్యే తాతయ్య



వాట్సాప్ గవర్నెన్స్ ఫోన్‌నంబర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తాతయ్య, రాఘవేంద్ర

జగ్గయ్యపేట అర్బన్: వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా మున్సిపల్ సేవలు ప్రజలకు మరింత చేరువ కావడంతోపాటు పారదర్శకత, జవాబుదారీతనం పెరుగుతుందని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్(తాతయ్య) పేర్కొన్నారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మంగళవారం ఆయన మున్సిపల్ గ్రీవెన్స్ నంబరు 9511141115 ను ప్రారంభించారు. ఎమ్మెల్యే తాతయ్య మాట్లాడుతూ మున్సిపాలిటీ ప్రజలకు సమీపంగా ఉండేందుకు, ప్రతి సమస్యను వెంటనే పరిష్కరించేందుకు ఈ వినూత్న కార్యక్రమం కీలక మైలురాయిలా నిలుస్తుందన్నారు. మున్సిపల్ చైర్మన్ రాఘవేంద్ర మాట్లాడుతూ జగ్గయ్యపేట మున్సిపాలిటీ ప్రజల సమస్యలను త్వరగా పరిష్కరించేందుకు ఆధునిక సాంకేతికతను వినియోగిస్తున్నట్లు తెలిపారు. ఈ కొత్త వాట్సాప్ గవర్నెన్స్ వ్యవస్థ ద్వారా పౌరులు తమ సమస్యలను నేరుగా మున్సిపల్ కార్యాలయానికి తెలియజేయవచ్చునన్నారు. వీధిలైట్లు, త్రాగునీరు, శుభ్రత, చెత్త తొలగింపు, డ్రైనేజి వంటి అంశాలకు సంబంధించిన ఫిర్యాదులను వాట్సాప్ ద్వారా పంపినట్లయితే, ఆయా ఫిర్యాదులను 48 గంటల్లోగా పరిష్కరిస్తామని వివరించారు. మున్సిపల్ కమిషనర్ డీటీవీ.కృష్ణారావు, ఏఈ హనుమంతరావు, కౌన్సిలర్లు, సచివాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

స్వచ్ఛ అవార్డులు అందుకున్న సర్పంచులు



కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా అవార్డును అందుకుంటున్న పరిటాల సర్పంచి వై.ఆనందజ్యోత్స్న



అవార్డు అందుకుంటున్న కంచికచర్ల సర్పంచి వేల్పుల సునీత, భూషణం



కలెక్టర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న పెనుగంచిప్రోలు సర్పంచ్ పద్మకుమారి

కంచికచర్ల: పంచాయతీల్లో మెరుగైన పారిశుద్ధ్య పనులు చేపట్టినందున పరిటాల సర్పంచి యద్దనపూడి ఆనందజ్యోత్స్న స్వచ్ఛ అవార్డు, కంచికచర్ల సర్పంచి వేల్పుల సునీతకు స్వచ్ఛ ఫెర్ఫార్మెన్స్ అవార్డు అందుకున్నారు. గ్రీన్ అంబాసిడర్ అవార్డును బెజ్జం భూషణం లభించింది.విజయవాడలో సోమవారం నిర్వహించిన స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ జీ లక్ష్మీశ, స్వచ్ఛ కార్పొరేషన్ చైర్మన్ పట్టాభిరామణ్, పోలీస్ కమిషనర్ రాజశేఖరబాబు, జిల్లా పంచాయతీ అధికారి లావణ్య చేతులమీదుగా వీరు అవార్డు అందుకున్నారు. అదేవిధంగా ఆయా గ్రామాల కార్యదర్శులు సాంబశివరావు, సుబ్రహ్మణ్యంలు అవార్డులు, ప్రశంసాపత్రాలు అందుకున్నారు. కార్యక్రమంలో నందిగామ ఆర్డీఓ కే బాలకృష్ణ, కంచికచర్ల ఎంపీడీఓ వెంకటేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీఓ ఏసుబాబు, నానిబాబు పాల్గొన్నారు.

పెనుగంచిప్రోలు మండలంలో..

పెనుగంచిప్రోలు: పారిశుద్ధ్య నిర్వహణలో జిల్లాలో అత్యుత్తమ పంచాయతీగా పెనుగంచిప్రోలు ఎంపికకాగా, విజయవాడలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ చేతుల మీదుగా సర్పంచ్ వేల్పుల పద్మకుమారి సోమవారం ఉత్తమ ప్రతిభాఅవార్డు అందుకున్నారు. ఈసందర్భంగా నాయకులు, గ్రామస్తులు ఆమెకు అభినందనలు తెలియజేశారు.

ఆందోళన బాటలో ఆశావర్కర్లు



పెనుగంచిప్రోలులో ఆందోళన చేస్తున్న ఆశావర్కర్లు



లింగాలపాడు పీహెచ్‌సీ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, ఆశావర్కర్లు

పెనుగంచిప్రోలు: తమ డిమాండ్లను పరిష్కరించాలంటూ మండలంలోని ఆశావర్కర్లు మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద ఆందోళన చేశారు.ఆయా డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని వైద్యాధికారికి అందజేశారు. ఈసందర్భంగా ఆశావర్కర్లు మాట్లాడుతూ తమకు కనీస వేతనం రూ.26 వేలు ఇవ్వాలని, అన్ని రకాల సెలవులు వర్తింపజేయాలని కోరారు. అంత్య క్రియల ఖర్చులు రూ.20వేలు చెల్లించాలన్నారు. నాణ్యమైన యూనిఫాంతోపాటు, పీహెచ్‌సీకి వెళ్లిన సందర్భంలో టీఏ, డీఏలు ఇవ్వాలని, ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం శిక్షణ పొందిన ఆశాలకు పోస్టుల భర్తీలో ప్రాధాన్యత కల్పించాలన్నారు. అధిక పని భారం తగ్గించడంతోపాటు పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ఆశావర్కర్ల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి తమ డిమాండ్లను పరిష్కరించకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు టి. సత్యవతి రాహేల్, ఎం.సావిత్రి, పి.సుజాత తదితరులు పాల్గొన్నారు.

నందిగామ మండలంలో..

నందిగామరూరల్: ఆశావర్కర్లకు కనీస వేతనాలు అందించడంతోపాటు వారు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి కటారపు గోపాల్ డిమాండ్ చేశారు. రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా సీఐటీయూ ఆధ్వర్యంలో మండలంలోని లింగాలపాడు, గోళ్లమూడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఎదుట ఆశావర్కర్లు మంగళవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశావర్కర్లకు అన్ని రకాల సెలవులు మంజూరు చేయాలన్నారు. మొబైల్ ఫోన్‌లు, సిమ్‌కార్డులు, నాణ్యమైన యూనీఫాం అందించాలన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్‌లను ఆశావర్కర్లుగా మార్చటంతోపాటు ఏఎన్‌ఎం, జీఎన్‌ఎం శిక్షణ పొందిన ఆశాలకు పోస్టుల భర్తీలలో ప్రాధాన్యతనివ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకుడు ఏసోబు, ఆశావర్కర్ యూనియన్ నాయకులు తిరుమలదేవి, వనజ, కవిత, మార్తమ్మ, ఆదిలక్ష్మీ, సునీత పాల్గొన్నారు.

ఉత్తమ స్వచ్ఛ అవార్డు అందుకున్న డాక్టర్ రత్నప్రియదర్శిని



అనిగండ్లపాడు(పెనుగంచిప్రోలు): మండలంలోని అనిగండ్లపాడు ఆయుర్వేద వైద్యశాల రాష్ట్రస్థాయిలో ఉత్తమ స్వచ్ఛ ఆయుష్ కేంద్రంగా ఎంపికైంది. విజయవాడలో సోమవారం జరిగిన కార్యక్రమంలో అనిగండ్లపాడు ఆయుర్వేద వైద్యశాల వైద్యాధికారి వై.రత్నప్రియదర్శిని సీఎం చంద్రబాబు చేతులమీదుగా అవార్డు అందుకున్నారు. డాక్టర్ వై.రత్నప్రియదర్శిని మాట్లాడుతూ సహకరించిన సిబ్బంది, గ్రామస్తులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

గండేపల్లి(కంచికచర్ల): విద్యుదాఘానికి గురై ఓ గేదె మృతిచెందిన ఘటన మంగళవారం కంచికచర్ల మండలంలో చోటుచేసుకుంది. గండేపల్లి గ్రామానికి చెందిన మందా వెంకటరత్నంకు చెందిన పశువులు మేత కోసం పాలవాగు సమీపంలోకి వెళ్లాయి. మోటార్లకు విద్యుత్‌ను సరఫరా చేసే సరఫరా చేసే వైర్లు తెగి విద్యుత్ స్తంభానికి సపోర్టుగా వేసిన వైర్‌పై పడ్డాయి. ఈక్రమంలో ఆ వైర్లు తగలడంతో విద్యుదాఘాతానికి గురై గేదె మృతిచెందింది. రూ.1.50లక్షల విలువైన పాడిగేదె మృతిచెందిందంటూ పాడిరైతు వెంకటరత్నం కన్నీటి పర్యంతమయ్యారు.